నేడు ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవం

మల్కాజిగిరి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి వందేళ్లు పూర్తైన సందర్భంగా మల్కాజిగిరి గాంధీ పార్కులో ఆదివారం సాయంత్రం విజయదశమి ఉత్సవం జరుగుతుందని మల్కాజిగిరి నగర సంఘచాలక్ జూలూరి శ్రీనివాస్, బక్క నాగరాజులు తెలిపారు. ముఖ్యఅతిథిగా రంగారెడ్డిజిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముదిగొండ సుధాకర్, ముఖ్యవక్తగా ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సహకార్యవాహ హాజరవుతారని ప్రకటించారు.

రేపు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల జాప్యంపై నిరాహార దీక్ష

ఉప్పల్: నారాపల్లి నుంచి ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ ఈనెల 6న ఉదయం 10 గంటల నుంచి మేడ్చల్ జిల్లా సీపీఎం పార్టీ అధ్వర్యంలో ఉప్పల్ చౌరస్తాలో నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు సీపీఎం పార్టీ నేతలు ప్రకటించారు. ఈ దీక్ష ప్రారంభానికి సీపీఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా స్థానికులు, పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

మల్కాజిగిరి: డివిజన్‌కు చెందిన సురేష్‌యాదవ్ వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బాధితులకు చెక్కును అందజేశారు. వాసగోని, శ్రీనివాస్‌గౌడ్, రాములు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు

పలువురికి గాయాలు



ఘట్‌కేసర్: ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ బాలసామి స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ నందిగామకు చెందిన మెక్కండ శ్రీనివాస్ టీఎస్ 06 ఈజే5858 నంబర్ గల కారులో శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి దర్శనం కోసం యాదగిరిగుట్టకు బయల్దేరారు. ఘట్‌కేసర్ ఘనాపూర్ వద్దకు రాగానే ఓఆర్ఆర్‌పై వేగంగా వెళ్తూ ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో పలువురికి గాయలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాధితులను చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అందులో ఓ అమ్మాయి పరిస్థితి విషమంగా ఉందని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజా ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి పెద్దపీట

టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్

బాలానగర్: ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ అన్నారు. శనివారం బాలానగర్‌లోని సాయినగర్ ప్రాంతానికి చెందిన పాలడుగు వెంకట కృష్ణకు రూ.8.80 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన నివాసంలో నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో చందు, వినాయక నగర్ అధ్యక్షుడు సిద్ధు, లక్ష్మణ్, పుష్పారెడ్డి, మల్లికార్జున్ గౌడ్, యుగేందర్ రెడ్డి, పులి శివకుమార్ గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, మధు, రామ్మోహన్ రావు, భరత్ పాల్గొన్నారు.

రోడ్లపైనే వాహనాల పార్కింగ్!

జీడిమెట్ల: ఇండస్ట్రీయల్ రోడ్డులో నిరంతరం వాహనదారులు పార్కింగ్ చేస్తుండటంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పెద్ద ట్రక్కులను డ్రైవర్లు పారిశ్రామికప్రాంతం రోడ్లలో పార్కింగ్ చేస్తున్నారు. జీడిమెట్ల ఫేజ్1 నుంచి ఎస్బీ కోఆపరేటివ్ సొసైటీకి వెళ్లే రోడ్డులో కొన్ని నెలలుగా రోడ్డులో వాహనదారులు ఇబ్బందులు పడతున్నారు. రెండు వైపుల నుంచి వాహనాలు వచ్చిన క్రమంలో వాహనాలు ఎటు వెళ్లలేక సతమతం అవుతున్నారు. 20 ఫీట్లు ఉన్న రోడ్డులో వాహనాలు 200 మీటర్ల మేర నిలుపుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇండస్ట్రీయల్ ఏరియాలో ఇతర రాష్ట్రాల నుంచి లోడింగ్, అన్‌లోడింగ్ కోసం వచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపై వాహనాలు నిలుపుతున్నారు. ఇలా అధికారులు పట్టించుకుని వాహనాలు రోడ్లపై నిలపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆగుతూ.. సాగుతూ..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నత్తనడకన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

- మొత్తం వచ్చిన దరఖాస్తులు 1.47లక్షలు
- మొదటి విడతలో 1,775 మందికి మంజూరు
- నిధుల విడుదల జాప్యంతో నెమ్మదించిన పనులు
- పూర్తయినవి 25 గృహాలు మాత్రమే
- బేస్‌మెంట్ లెవల్‌లో 624, రూఫ్ లెవల్‌లో 284



సాక్షి,మేడ్చల్ జిల్లా: జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. నిధుల విడుదలలో జాప్యం.. పలు సాంకేతిక సమస్యల నేపథ్యంలో చాలావరకు పునాది దశల్లోనే దర్శనమిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం 1.47 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నా.. ఇందులో స్థలం లేని వారే అధికంగా ఉండడంతో మొదటి విడతలో 1,775 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేశారు. ఇప్పటివరకు బోడుప్పల్ పురపాలక సంఘంలో 118 ఇండ్లు, దమ్మాయిగూడలో 128, ఘట్‌కేసర్‌లో 149, గుండ్ల పోచంపల్లిలో 20, జవహర్‌నగర్‌లో 139, మేడ్చల్‌లో 280, ఎంసీపల్లిలో 253, నాగారంలో 112, పీర్జాదిగూడలో 75, పోచారంలో 82, తూంకుంట పురపాలక సంఘంలో 55, మేడ్చల్ మండల పరిధిలో 151, శామీర్‌పేట మండలంలో 204 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో బేస్‌మెంట్ దశలో 624 ఇండ్ల నిర్మాణం కొనసాగుతుండగా, రూఫ్ లెవల్‌లో 284, మార్కింగ్ లెవల్‌లో 905 ఉన్నాయి. మిగతావి చివరి దశలో ఉన్నప్పటికీ, ఫినిషింగ్ పూర్తయిన ఇండ్లు మాత్రం 25కు మించకపోవడం గమనార్హం.

నిబంధనలే ప్రతిబంధకం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలంటే షరతులు ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ఫలితంగా నిర్మాణంలో జాప్యం.. నిధుల విడుదల్లో ఆలస్యం జరుగుతోందన్న అభిప్రాయాలను లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 400-600 లోపు చదరపు అడుగుల ఫీట్లు (45-65 గజాలు) స్థలంలోనే ఇల్లు నిర్మించాలి. అన్ని సౌకర్యాలతో అనుకూలంగా నిర్మించుకునేందుకు దశలవారీగా ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది.

పనుల వేగవంతంపై దృష్టి..

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ పీడీ కలిసి నిర్మాణాలను పరిశీలిస్తున్నారు. వార్డు ఆఫీసర్, కమిషనర్, మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలు నిర్వహిస్తూ పనులు ఊపందుకునేలా చర్యలు తీసుకుంటోంది.

స్థలం లేకున్నా.. ఇండ్ల కోసం దరఖాస్తు

జిల్లాలో వలస కుటుంబాలు అధికంగా ఉన్నాయి. బతుకుదెరువు కోసం తెలంగాణలో వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అద్దె ఇండ్లలో నివాసముంటున్న వలస కుటుంబాలతోపాటు జిల్లాలోని 16 పురపాలక సంఘాలు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని వివిధ మున్సిపల్ సర్కిళ్లలోని స్లమ్ ఏరియాలు, గుడిసెవాసుల కాలనీలు, గ్రామిక ప్రాంతాల్లో ఉంటున్న చాలామంది నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే 1.47లక్షల దరఖాస్తులు అందాయి. అయితే వీరిలో చాలామందికి నివాస స్థలాలు లేకపోవడంతో ఇండ్లు మంజూరు చేయడం అధికార యంత్రాంగానికి పెద్ద సమస్యగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఇందులో అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై మున్సిపల్ కమిషనర్లు కసరత్తు చేస్తున్నారు. ఎంపిక తర్వాత..అక్కడే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకునేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. రెండో విడతలో భాగంగా 1,725 ఇండ్లు మంజూరు చేసేందుకు లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు జరుగుతోంది. జిల్లాలో 5 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున 17,500 ఇండ్లు మంజూరు కానుండడంతో.. ప్రస్తుతం మంజూరు చేసిన 1,775 ఇండ్లు మినహాయించి మిగతా వాటిని గుర్తించిన స్లమ్ ఏరియాల్లోని అర్హులకు కేటాయించి రీ-డెవలప్‌మెంట్ పథకం కింద వారికి అక్కడే (పాత నివాసం స్థానంలో) ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కార్యక్రమాలకు అధికార యంత్రాంగం శ్రీకారం చుడుతోంది. ముఖ్యంగా పురపాలక సంఘాలు ఈ బాధ్యతను నిర్వర్తించేలా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

పూర్తయినవి 25 మాత్రమే

జిల్లాలో 1,775 ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 25 ఇండ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగతావి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. పనులు పూర్తయిన వాటికి పూర్తి స్థాయిలో ఆర్థిక సాయం అందగా, వివిధ దశల్లో ఉన్నవాటికి ప్రతీ సోమవారం అందజేస్తున్నారు.

రేపు ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద నిరాహార దీక్ష

ఘట్‌కేసర్: ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనుల అలసత్వానికి నిరసనగా ఈనెల 6న ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రవి పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీనియర్ నాయకుడు యాదయ్య అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. దీక్షకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి సబిత, సభ్యుడు చంద్రమోహన్, నాగమణి, అలివేలు, సునిత, రాజిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రవి

ఆరోగ్యవంతమైన జీవితానికి వ్యాయామం అవసరం

బోడుప్పల్: ఆరోగ్యవంతమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. సాయి ఐశ్వర్య కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన 'గ్రోత్ ఫిట్‌నెస్' స్టూడియోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో వ్యాయామం ఒక భాగమన్నారు. అనంతరం పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యం, అందంపై ప్రతి ఒక్కరికి ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్డియో, క్రాస్‌ఫిట్, జుంబా, డ్యాన్స్, యోగ, యూనిసెక్స్‌జిమ్, అథ్లెటిక్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి, జిమ్ నిర్వాహకులు మహమ్మద్ సోహెల్, అరిఫ్ పాల్గొన్నారు.



జిమ్ ప్రారంభోత్సవంలో మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్: మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శనివారం శివాని శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పుష్పాంజలి, బ్రహ్మాంజలి, జతిస్వరం, తాండవ నృత్యకారి, శ్రీలలితాహారతి, శివాష్టకం, గరుడగమన, శ్యామలే మీనాక్షి తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

ప్రజల సౌకర్యం కోసమే కమ్యూనిటీ హాళ్లు



మల్కాజిగిరి: కాలనీల్లో కమ్యూనిటీహాళ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. శనివారం ఉప్పరిగూడ సంజయ్ గాంధీనగర్‌లో రూ.20 లక్షలతో చేపట్టే కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఉన్న కమ్యూనిటీహాల్స్‌లో పూర్తిస్థాయి వసతులు కల్పించి పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కమ్యూనిటీహాల్స్ కాలనీ ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని, వాటి నిర్వహణ సంక్షేమ సంఘాలకు అప్పగిస్తామన్నారు. ఉమేష్‌సింగ్, సత్యమూర్తి, కిషోర్, మజీద్, అరుణ్, బాలయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

ఎమ్మెల్యే వివేకానంద్



కుత్బుల్లాపూర్: పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపల్ పరిధిలోని మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లో 'ఇస్మాయిలీ సివిక్' ఆధ్వర్యంలో ఇస్మాయిల్ కౌన్సిల్ ఫర్ సికింద్రాబాద్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శిబిరంలో 400 మంది పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా ఈ ఉచిత వైద్య శిబిరాలతో నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఇస్మాయిల్ సివిక్ సంస్థకు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవిత, బీఆర్‌ఎస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు జంగా కుమార్, సంగీతా రెడ్డి, వేణు యాదవ్, ఇస్మాయిల్ కౌన్సిల్ ఫర్ సికింద్రాబాద్ అధ్యక్షుడు ఇక్బాల్ మందని పాల్గొన్నారు.

అమ్మవారి చీరల వేలం

బోడుప్పల్: వాసవీనగర్ కాలనీలో జై భవానీ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి చీరలను వేలం వేశారు. నిఖిల్ రూ. 6,100, మీసాల గాయత్రి రూ 8,900, వీరమల్లు రూ 11,116, నర్సింహులు రూ.10,001, వెంకటేష్ రూ.12,100, కీర్తన రూ.16,700, లక్ష్మీదేవి రూ.17,000, హాసినిరెడ్డి రూ.17,600, లహరి రూ.13,200, చంద్రశేఖర్ రూ.14,000, భారతమ్మ రూ.12,000లకు దక్కించుకున్నారు.

చిక్కినట్టే చిక్కి.. అంతలోనే పరార్

- ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో చోరీ
- పోలీసుల నుంచి తప్పించుకున్న నిందితుడు

ఉప్పల్: ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో చోరీ జరిగిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ప్రెస్‌క్లబ్ తాళాలు పగులకొట్టి డీవీఆర్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ వస్తువులు ఎత్తుకెళ్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇంతలోనే దుండగుడు పోలీస్‌స్టేషన్ నుంచి పరారయ్యాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యర్థాలపై చర్యలు తీసుకోండి !



చెంగిచర్లకు వెళ్లే రహదారి పక్కన ఇలా..



జ్యోతినగర్ ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో పలు కాలనీల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోడ్డు పక్కన వ్యర్థాలను ఇష్టానుసారంగా పారవేయడంతో చెత్త పేరుకుపోతోంది. దీంతో పశువులు తిరుగుతూ పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు ప్రత్యే చొరవ తీసుకుని వ్యర్థాలను తొలగించి, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఓ పైపు సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరో వైపు పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు స్వచ్ఛతపై ప్రజలకు అనేకసార్లు అవగాహన కల్పించిన ఫలితం లేకుండా పోతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి వ్యర్థాలను ఇష్టానుసారంగా పారవేసే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

సుభాష్‌నగర్: సూరారం సాయిబాబానగర్‌లోని గాజులరామారం సర్వే నంబర్ 49/8 వెలసిన షెడ్డును రెవెన్యూ అధికారులు కూల్చి వేశారు. దసరా సెలవుల్లో భాగంగా కబ్జాదారులు గుట్టు చప్పుడు కాకుండా గదుల చుట్టూ ప్రహరీలు నిర్మించారు. ఏకంగా ప్రధాన రోడ్డును ఆనుకుని షెడ్డును ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీం శనివారం షెడ్డును కూల్చి వేశారు.

రహదారులు ఛిద్రం..!

ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా మారిన రోడ్లు

- ఓ వైపు గుంతలు.. మరోవైపు తేలిన కంకర
- మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీల్లో ఇది పరిస్థితి
- రాకపోకలకు వాహనదారుల తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా జాతీయ రహదారి

మేడ్చల్: ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్ని ఛిద్రమయ్యాయి. ఓవైపు భారీ గుంతలు.. మరోవైపు కంకర తేలిన బీటీ, సీసీ రోడ్లు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. నగర శివార్లలోని మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీల్లోని ప్రధాన, లింకు, గ్రామాలకు వెళ్లే చాలా రోడ్ల పరిస్థితి ఇలాగే ఉంది.

మేడ్చల్‌లో..

- మేడ్చల్‌లో ప్రధాన రోడ్లన్ని పూర్తిగా దెబ్బతిన్నాయి. వివేకానంద విగ్రహం నుంచి రైల్వేస్టేషన్ వైపు వెళ్లే రోడ్డు గ్రంథాలయం వద్ద అసంపూర్తి డ్రైనేజీ నిర్మాణంతో ప్రయాణానికి ఏమాత్రం అనువుగా లేకుండా పోయింది.
- పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లో రోడ్లన్ని గుంతలమయంగా తయారయ్యాయి. ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిన్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు.
- మార్కెట్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు ఏసీపీ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం వద్ద భారీ గుంతలు పడి ప్రమాదకరంగా మారింది.
- చెక్‌పోస్టు నుంచి కిష్టాపూర్ వెళ్లే రోడ్డు బస్టాండ్ నుంచి కిష్టాపూర్ వెళ్లే రహదారి రోడ్డు పూర్తిగా గుంతలమయమై, కంకర తేలడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మేడ్చల్ నుంచి గౌడవెల్లి రోడ్డు, మేడ్చల్ నుంచి గిర్మాపూర్ రోడ్డు, మేడ్చల్ నుంచి బర్మాజీగూడ రోడ్డు, మేడ్చల్ నుంచి బాలాజీనగర్, రాఘవేంద్రనగర్, జయదర్శిణి మీదుగా రావల్‌కోల్ రోడ్డు ఇలా.. ఏది చూసినా గుంతలమయంగా కనిపిస్తున్నాయి. అయినా అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

ఎల్లంపేట్ పరిధిలో..

ఎల్లంపేట్ పెద్ద మున్సిపాలిటీ కావడంతో రోడ్ల నిర్వహణను అధికారులు అంతగా పట్టించుకోవడం లేదు. ఎల్లంపేట్ చౌరస్తా నుంచి సోమారం వరకు, చౌరస్తా నుంచి ఎల్లంపేట్ వరకు, డబీల్‌పూర్ చౌరస్తా నుంచి డబీల్‌పూర్, నూతన్‌కల్, బండమాదారం, శ్రీరంగవరం, రాయిలాపూర్ వరకు రోడ్డు గుంతలమయమై కంకరతేలి అధ్వాన్నంగా మారాయి. రావల్‌కోల్, రాజబొల్లారం రోడ్లు కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. మేడ్చల్ నుంచి శామీర్‌పేట్ రోడ్డుపై భారీ వాహనాలు తిరుగుతుండడంతో డబీల్‌పూర్, ఎల్లంపేట్, రావల్‌కోల్ చౌరస్తాల వద్ద భారీ గుంతలు పడ్డాయి.

హైవే సైతం అధ్వానం..

మేడ్చల్ మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి విస్తరణ, ఫ్లైవర్ పనులు కొనసాగుతున్నాయి. మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి అత్వెల్లి వరకు ఈ రహదారి దెబ్బతింది. ప్రధానంగా మేడ్చల్‌లో ఆర్టీసీ కాలనీ నుంచి చెక్‌పోస్టు వరకు రోడ్డుపై చాలా వరకు గుంతలు పడ్డాయి. అసలే రోడ్డు విస్తరణ పనులకు తోడు వర్షాలు.. ఆపై రోడ్ల నిర్వహణ లోపంతో 4 కిలోమీటర్ల ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ జాంలు, గుంతల్లో నీరు నిల్వ ఉండడంతో జాతీయ రహదారి పై ప్రయాణం అంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



రేకులబావి సమీపంలో జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు



డబీల్‌పూర్ చౌరస్తా వద్ద





కేఎల్ఆర్‌నగర్ లో దెబ్బతిన్న రోడ్లు